సాక్షి
అనంతపురం
శనివారం । 20 । జనవరి । 2024



అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను ఉరవకొండ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. బైకులు, నగలు స్వాధీనం చేసుకున్నారు. 8లో



టమాట కిలో రూ.15

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.15 పలికింది. కనిష్టం రూ.6, సరాసరి రూ.12 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
34.4°/16.5°

జిల్లా అంతటా శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉదయం చలి తీవ్రత కొనసాగింది. ఆగ్నేయం దిశగా గాలులు గంటకు 6 నుంచి 8 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

'ఉపాధి' నిధులతో పశువుల షెడ్ల నిర్మాణాలు



అనంతపురం టౌన్: ఉపాధి హామీ పథకం నిధులతో జిల్లా వ్యాప్తంగా పశువుల షెడ్ల నిర్మాణాలను చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని జిల్లా నీటియాజమాన్య సంస్థ (డ్వామా) ప్రాజెక్టు డైరెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉపాధి హామీ అధికారులు, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టనున్నట్లు తెలిపారు. రెండు పశువుల షెడ్ల నిర్మాణానికి రూ.లక్ష, నాలుగు పశువులకు రూ.1.50 లక్షలు, 6 పశువులకు రూ.1.80 లక్షల ఉపాధి నిధులు కేటాయించినట్లు వెల్లడించారు. చిన్న, సన్నకారు పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వి నియోగం చేసుకోవాలన్నారు. షెడ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న పాడి రైతులు వారి ప్రాంతానికి దగ్గరలో ఉన్న పశు సంవర్ధక శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ గ్రామ సభల ద్వారా ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

నలుగురు సీఐల బదిలీ

అనంతపురం క్రైం: అనంతపురం రేంజ్ పరిధిలో నలుగురు సీఐలకు స్థానచలనం కల్పిస్తూ డీఐజీ ఆర్ఎస్ అమ్మిరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అనంతపురం ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌లో ఉన్న ఎం.శ్రీనివాసులును రాయదుర్గానికి, రాయదుర్గం రూరల్ సీఐ వి.యుగంధర్‌ను పెనుకొండకు, పెనుకొండ సీఐ పి.రాజారమేష్‌ను శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో వీఆర్‌కు, పుట్టపర్తి సీఐ జె.ప్రసాద్‌బాబును రాయదుర్గం సర్కిల్‌కు బదిలీ చేశారు.

పక్కాగా కుల గణన

- తొలిరోజున 10,757 కుటుంబాల సర్వే



అనంతపురంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి

అనంతపురం అర్బన్: కుల గణను పక్కాగా నిర్వహించాలని సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి సచివాలయ ఉద్యోగులకు సూచించారు. శుక్రవారం జిల్లావ్యాప్తంగా కుల గణన కార్యక్రమంలో భాగంగా ఇంటింటి సర్వే ప్రారంభమైంది. మొత్తం 663 సచివాలయాల పరిధిలో 11,672 క్లస్టర్లలోని 7,45,122 కుటుంబాలను సర్వే చేయాల్సి ఉంది. తొలి రోజు 10,757 కుటుంబాలను సర్వే చేశారు. నగరంలో సర్వే తీరును సీపీఓ అశోక్‌కుమార్‌రెడ్డి, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ రమణారెడ్డి పరిశీలించారు.

నేడు జేఎన్‌టీయూ వీసీ బాధ్యతల స్వీకరణ

అనంతపురం: జేఎన్‌టీయూ(ఏ) నూతన వీసీగా నియమితులైన ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాసరావు శనివారం పదవీ బాధ్యతలు స్వీకరించనున్నారు. నూతన పాలక భవనంలో ఉదయం 10:30 గంటలకు బాధ్యతలు తీసుకుంటారని యూనివర్సిటీ వర్గాలు తెలిపాయి.

ప్రతి అర్జీ పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఆనంద్

అనంతపురం అర్బన్: ఉద్యోగుల సమస్యలపై అందించే వినతులను పరిష్కరించాలని అధికారులను డిప్యూటీ కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన 'ప్రత్యేక స్పందన' కార్యక్రమంలో ఉద్యోగుల నుంచి 15 వినతులు అందాయి. కార్యక్రమం అనంతరం అర్జీల పరిష్కారంపై డిప్యూటీ కలెక్టర్ సమీక్షించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి చట్ట పరిధిలో పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో స్పందన ఇన్‌చార్జ్ మారుతి, డ్వామా స్టాటిస్టికల్ అధికారి గిరిధర్, సర్వేయర్ ప్రతాపరెడ్డి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

అనంతపురం టౌన్: నగరంలోని డీ-4 సబ్ స్టేషన్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ నాగేంద్ర ఓ ప్రకటనలో తెలిపారు. హౌసింగ్ బోర్డు, నవోదయ కాలనీ, బెంగళూరు రోడ్డు, హమాలీ కాలనీ, భైరవ నగర్, శారద నగర్, బుడ్డప్ప నగర్, ఎస్‌బీఐ కాలనీ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

అత్యల్ప వర్షపాతం నమోదయ్యే ప్రాంతంగా పేరొందిన అనంతపురం జిల్లాలో తక్కువ నీటితోనే ఎక్కువ విస్తీర్ణంలో పంటలు పండించాలంటే బిందు, తుంపర సేద్యమే దిక్కు. ఈ ప్రాంత రైతుల అవసరాలకు అనుగుణంగా బిందు–తుంపర సేద్యం పరికరాలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.





సూక్ష్మ సేద్యంలో దూకుడు

- పరికరాల పంపిణీలో అనంత అగ్రస్థానం
- 12,500 హెక్టార్లకు గాను 11,375 హెక్టార్లకు యూనిట్ల పంపిణీ
- నాలుగో స్థానంలో కొనసాగుతున్న శ్రీసత్యసాయి జిల్లా

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో డ్రిప్–స్ప్రింక్లర్లకు డిమాండ్ ఏర్పడింది. దరఖాస్తు చేసుకున్న రైతులకు ఏపీఎంఐపీ అధికారులు సకాలంలో డ్రిప్ పరికరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో బిందు, తుంపర (డ్రిప్, స్ప్రింక్లర్) యూనిట్ల పంపిణీలో 'అనంత' దూసుకుపోతోంది. ప్రస్తుత 2023-24 ఆర్థిక సంవత్సరంలో 12,500 హెక్టార్లకు పరికరాలు పంపిణీ చేయాలని లక్ష్యం పెట్టుకోగా ఇప్పటికే 11,375 హెక్టార్లకు ఇచ్చారు. మంజూరు, ఇన్‌స్టాలేషన్‌లో అన్ని జిల్లాల కన్నా 'అనంత' మొదటి స్థానంలో నిలిచింది. ప్రకాశం జిల్లా 9,124 హెక్టార్లు, వైఎస్సార్ జిల్లా 8,382 హెక్టార్లతో రెండు, మూడు స్థానాల్లో ఉండగా.. 6,837 హెక్టార్లతో శ్రీసత్యసాయి జిల్లా నాలుగో స్థానంలో కొనసాగుతోంది. ఐదు ఎకరాల్లోపున్న చిన్న సన్నకారు రైతులకు 90 శాతం, ఆ పైన భూమి కలిగిన రైతులకు 70 శాతం రాయితీతో డ్రిప్ యూనిట్లు ఇస్తున్నారు. ఇక స్ప్రింక్లర్ సెట్లపై ఐదు ఎకరాల్లోపున్న రైతులకు 55 శాతం రాయితీ, ఆ పైన 12.50 ఎకరాల వరకు 45 శాతం రాయితీ వర్తింపజేస్తున్నారు.

34 వేల హెక్టార్లకు రిజిస్ట్రేషన్

అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఉన్న 451 ఆర్‌బీకేల పరిధిలో డ్రిప్, స్ప్రింక్లర్ల కోసం రైతులు పెద్ద సంఖ్యలో ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. అన్ని జిల్లాల కన్నా అధికంగా 26,690 మంది రైతులు 34 వేల హెక్టార్లకు పరికరాలు కావాలని పేర్లు నమోదు చేసుకున్నారు. క్షేత్రస్థాయిలో ప్రాథమిక పరిశీలన తర్వాత ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే సీనియార్టీ ఆధారంగా అర్హత కలిగిన రైతుల నుంచి డిజిటల్ పద్ధతిలో తమ వాటా మొత్తాన్ని కట్టించుకుని కలెక్టర్ ద్వారా మంజూరు చేస్తున్నారు. ఇప్పటికే 9,314 మంది రైతులకు 11,375 హెక్టార్లకు సరిపడా యూనిట్లు మంజూరు చేశారు. అందులో 90 శాతం వరకు పరికరాలు సరఫరా చేసి పొలాల్లో బిగించారు.

సకాలంలో నాణ్యమైన డ్రిప్



ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోపే డ్రిప్ పరికరాలు మంజూరయ్యాయి. ఐదెకరాల్లోపున్న చిన్నసన్నకారు రైతు కావడంతో నాకు 90 శాతం రాయితీ వర్తించింది. అనుకున్న సమయానికి డ్రిప్ బిగించడంతో 3.20 ఎకరాల్లో ఇప్పుడు టమాట వేసుకున్నా. 90 శాతం రాయితీతో సకాలంలో నాణ్యమైన డ్రిప్ ఇస్తుండటంతో నాలాంటి రైతులకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం చాలా మేలు చేస్తోంది.

– ఎం.ఎర్రినాగప్ప, ఎస్సీ రైతు, కొర్రపాడు, బుక్కరాయసముద్రం మండలం

ఫిబ్రవరి 15లోపు టార్గెట్ పూర్తి



ప్రభుత్వ ఆదేశాల మేరకు 12,500 హెక్టార్ల లక్ష్యం ఫిబ్రవరి 15 లోపు పూర్తికి మంజూరు ప్రక్రియ వేగవంతం చేశాం. కలెక్టర్, జాయింట్ కలెక్టర్ సహకారంతో రైతులకు సకాలంలోనే బిందు, తుంపర పరికరాలు అందిస్తున్నాం. మరీ ముఖ్యంగా ప్రస్తుతం అరటి సాగు సీజన్ కావడంతో ఆలస్యం చేయకుండా మంజూరుతో పాటు మెటీరియల్ సప్లై, ఇన్‌స్టాలేషన్ కూడా చురుగ్గా చేపట్టాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యత ఇస్తూనే సీనియార్టీ ప్రకారం మిగతా రైతులకు కూడా యూనిట్ల పంపిణీ కొనసాగిస్తున్నాం.

– జి.ఫిరోజ్‌ఖాన్, పీడీ, ఏపీఎంఐపీ

ప్రజారోగ్యానికి ప్రాధాన్యత



రాప్తాడు మండలం గొందిరెడ్డిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని పరిశీలిస్తున్న భ్రమరాంబదేవి

అనంతపురం మెడికల్/రాప్తాడు: ప్రజారోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద పీట వేసిందని డీఎంహెచ్ఓ భ్రమరాంబదేవి తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా ఉచితంగా వైద్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి నెట్‌వర్క్, జిల్లా ఆస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. శుక్రవారం జిల్లాలోని కందుకూరు, హనిమిరెడ్డిపల్లి, బండూరు, పాలవెంకటాపురం, వడియంపేట, ఎం.హనుమాపురం, ఇల్లూరు, అబ్బేదొడ్డి, రంగసముద్రం, దోసలుడికి, కంబదూరు-3, హనకనహాళ్, కమ్మూరు, కరిగానిపల్లె- 1, నార్పల- 2, అనుంపల్లె, తబ్జుల, రావులుడికి, గొందిరెడ్డిపల్లి, పల్లేపల్లి, అయ్యగార్లపల్లి, పెరవళి, బూదగవి, గుళ్యపాళ్యం, విడపనకల్లు-1, చందన, యల్లనూరు- 2 వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ల పరిధిలో 'ఆరోగ్య సురక్ష' శిబిరాలు జరిగాయి. 11,656 మంది ఓపీ సేవలు వినియోగించుకున్నారు. వివిధ రకాల సమస్యలతో బాధపడుతున్న 10 మందిని స్పెషలిస్టు వైద్యులు జిల్లా ఆస్పత్రి, నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. గొందిరెడ్డిపల్లిలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని డీఎంహెచ్ఓ పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సాల్మన్, సీహెచ్ఓ శివప్రసాద్, హెల్త్ సూపర్ వైజర్లు నరసింహారావు, అరుణమ్మ, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- రూ.13,844 కోట్లతో 2024-25 రుణప్రణాళిక
- నాబార్డు బుక్‌లెట్ విడుదలలో జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అగ్రికల్చర్: రానున్న 2024–25 సంవత్సర వార్షిక రుణ ప్రణాళికలో వ్యవసాయ, అనబంధ రంగాలకు పెద్దపీట వేయనున్నారని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి బ్యాంకు (నాబార్డు) రూపొందించిన పొటెన్షియల్ లింక్డ్ క్రెడిట్ ప్లాన్‌కు సంబంధించిన బుక్‌లెట్‌ను జేసీ విడుదల చేశారు. వచ్చే ఏడాది బ్యాంకుల ద్వారా అన్ని రంగాలు, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం రూ.13,844 కోట్ల అంచనాతో క్రెడిట్‌ప్లాన్ తయారు చేశారన్నారు. ఇందులో ప్రధానంగా వ్యవసాయ, అనుబంధ రంగాల కింద అంటే పంట రుణాలు, టర్మ్‌లోన్లు, హార్టికల్చర్, సెరికల్చర్, యాంత్రీకరణ, పౌల్ట్రీ, గొర్రెలు, మేకల పెంపకం, డెయిరీ తదితర వాటి కింద రూ.8,945 కోట్ల మేర ఇవ్వడానికి ప్రణాళిక తయారు చేసినట్లు తెలిపారు. ఇవి కాకుండా కుటీర, మధ్యస్థ పరిశ్రమలు, ఫారెస్ట్, వాటర్ మేనేజ్‌మెంట్, విద్య, హౌసింగ్ తదితర వాటికి కూడా ప్రాధాన్యత ఇచ్చారన్నారు. త్వరలోనే లీడ్‌బ్యాంకు, బ్యాంకర్లతో సమావేశమై స్వల్పమార్పులతో తుదిరూపు ఇవ్వనున్నట్లు నాబార్డు డీడీఎం అనురాధ తెలిపారు. కార్యక్రమంలో డీఏఓ ఉమామహేశ్వరమ్మ, పశుశాఖ జేడీ డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, ఉద్యానశాఖ అధికారి బి.రఘునాథరెడ్డి, సెరికల్చర్ అధికారి డి.అంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

- మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి
- వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతలతో విస్తృతస్థాయి సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ: ఈ నెల 23న ఉరవకొండలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక బళ్లారి బైపాస్‌లోని దేవాంగ కల్యాణ మండపంలో సీఎం పర్యటనపై పార్టీ ముఖ్యనేతలతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ తేజోనాథ్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి మాజీ ఎమ్మెల్యేతో పాటు పార్టీ సీనియర్ నేతలు ప్రసాద్ రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సోదరుడు వై.శ్రీనాథ్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు. విశ్వేశ్వరరెడ్డి మట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా డ్వాక్రా మహిళలకు 'వైఎస్సార్ ఆసరా' ద్వారా నాల్గో విడత రుణమాఫీ సొమ్మును జమ చేసేందుకు సీఎం ఉరవకొండకు వస్తుండటం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పట్టణంలో బహిరంగ సభ వేదిక నుంచి సీఎం బటన్‌నొక్కి రుణమాఫీ సొమ్ము విడుదల చేస్తారన్నారు. సీఎం పర్యటనకు ప్రతి ఊరి నుంచి భారీగా జనం తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ సుశీలమ్మ, ఐదు మండలాల పార్టీ కన్వీనర్లు సుంకన్న, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, బసన్న, సోమశేఖర్, ఎంపీపీలు నరసింహులు, దేవీబాయి, కరణం పుష్పావతి, జెడ్పీటీసీ సభ్యులు ఏసీ పార్వతమ్మ, మమత, హనమంతు, త్రిలోక్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు తేజోనాథ్, భరత్‌రెడ్డి, ఆసిఫ్, దేవేంద్ర, శ్రీనివాసులు, కురుబ, ఎంబీసీ, వాల్మీకి కార్పొరేషన్ల డైరెక్టర్లు గోవిందు, వెంకటేష్, దుద్దేకుంట రామాంజినేయులు, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మీరం బాషా, మాజీ ఎంపీపీ చంద్రమ్మ, పంచాయతీరాజ్ విభాగం జిల్లా అధ్యక్షుడు బసవరాజు, పీఏసీఎస్ చైర్మన్ వడ్ల షేక్షావలి, మోమిన్ జిలాన్, పామిడి సలీం, మేరీ నిర్మలమ్మ, సర్పంచ్‌లు మోనాలిసా తదితరులు పాల్గొన్నారు.

నేడు మంత్రి పెద్దిరెడ్డి పర్యటన

రాయదుర్గం/ఉరవకొండ: వైఎస్సార్‌సీపీ రీజనల్ కో ఆర్డినేటర్, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి శనివారం ఉరవకొండలో పర్యటించనున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వరరెడ్డి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఈ నెల 23న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 'వైఎస్సార్ ఆసరా' నాల్గో విడత రుణమాఫీ నగదును ఉరవకొండ నుంచి బటన్ నొక్కి డ్వాక్రా అక్కచెల్లెమ్మల ఖాతాలకు జమ చేస్తారన్నారు. ఈ నేపథ్యంలో సీఎం పర్యటన విజయవంతం చేసే ప్రక్రియలో భాగంగా ముందస్తు ఏర్పాట్లను ఇన్‌చార్జ్ మంత్రి పెద్దిరెడ్డి పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లాలోని ఎమ్మెల్యేలు, ఎంపీ, సమన్వయకర్తలు, ముఖ్య నాయకులంతా పాల్గొనాలని వారు పిలుపునిచ్చారు.

పకడ్బందీ ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమి, చిత్రంలో ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి

అనంతపురం అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 23న ఉరవకొండ పర్యటనకు వస్తున్నారని, ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ గౌతమి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘస్వరూప్, డీఆర్ఓ గాయత్రీదేవి, ఎస్పీ విజయభాస్కర్‌రెడ్డితో కలిసి సీఎం పర్యటనపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి సీఎం పర్యటనను విజయవంతం చేయాలన్నారు. పర్యటన ఏర్పాట్లలో లోటుపాట్లకు తావివ్వకూడదన్నారు. ముఖ్యంగా వాహనాలకు పార్కింగ్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సభా స్థలి, పార్కింగ్, హెలిప్యాడ్, వీఐపీ వాహనాల పార్కింగ్ వద్ద ఏర్పాట్లు పక్కాగా ఉండాలన్నారు. కార్యక్రమానికి హాజరయ్యే ప్రజలకు భోజన సదుపాయం కల్పించాలన్నారు. గ్యాలరీల్లో స్నాక్స్, నీటి సదుపాయం కల్పించాలన్నారు. ముఖ్యంగా మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. సభాస్థలి వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో వివిధ శాఖల అధికారుల పాల్గొన్నారు.

అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలి

- తప్పుల్లేని ఓటర్ల జాబితా సిద్ధమవ్వాలి
- ప్రతి పోలింగ్ కేంద్రాన్నీ తనిఖీ చేయాలి
- అధికారులకు కలెక్టర్ గౌతమి ఆదేశం



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ గౌతమి, జేసీ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ఎన్నికలు పూర్తయ్యే వరకు అప్రమత్తంగా, అత్యంత జాగ్రత్తగా ఉంటూ విధులు నిర్వర్తించాలని కలెక్టర్ గౌతమి అధికారులకు సూచించారు. శనివారం సాయంత్రంలోగా ప్రతి పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసి సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలన్నారు. ప్రత్యేక ఓటరు జాబితా సవరణ అంశంపై రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం విజయవాడ నుంచి జిల్లా ఎన్నికల అధికారులతో (కలెక్టర్లు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, డీఆర్ఓ గాయత్రీదేవి పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఓటు నమోదు, తొలగింపు, వివరాల మార్పునకు సంబంధించిన క్లెయిమ్‌లు పక్కాగా విచారణ చేయడమే కాకుండా వివరాలను సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. పోలింగ్ కేంద్రాలను ఈఆర్ఓలు వ్యక్తిగతంగా తనిఖీ చేయాలని ఆదేశించారు. కేంద్రాల్లో మౌలిక సదుపాయాలను పరిశీలించి సమగ్ర నివేదిక ఇవ్వాలన్నారు.

చిన్నతప్పుకూ ఆస్కారమివ్వకండి

ఎన్నికలకు సంబంధించి ఏ చిన్నతప్పు జరిగినా కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుందని కలెక్టర్ హెచ్చరించారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని తప్పులకు ఆస్కారం ఇవ్వకూడదన్నారు. ఓటరు జాబితాలో ప్రజాప్రతినిధుల ఓటు ఉందా అనేది తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల్లో సెక్టోరియల్ అధికారుల పాత్ర కీలకమన్నారు. ఆయా నియోజకవర్గాల సెక్టోరియల్ అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ప్రతి అంశంపైనా మాట్లాడి తగిన సూచనలివ్వాలని ఆదేశించారు. గత ఎన్నికల సందర్భంలో పోలింగ్‌కు ముందు రోజు లేదా పోలింగ్ రోజున ఎక్కడైనా గొడవలు జరిగాయేమో ని తెలుసుకుని సమస్యాత్మక ప్రాంతాలను మ్యాపింగ్ చేసుకోవాలన్నారు. సమావేశంలో ఆర్డీఓలు గ్రంధి వెంకటేష్, రాణీసుస్మిత, శ్రీనివాసులురెడ్డి, ఈఆర్ఓలు సుధారాణి, వెంకటేశ్వర్లు, కరుణకుమారి, వెంకటనారాయణమ్మ, వరప్రసాద్, డీఐఓ రవిశంకర్, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ భాస్కర్, ఎస్ఏ శామ్యూల్ బెంజిమన్, ఎన్నికల డీటీలు పాల్గొన్నారు.

కందుల కొనుగోలుకు చర్యలు

అనంతపురం అర్బన్: మార్కెట్ ధరలతో రైతుల నుంచి కందుల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ అధికారులను ఆదేశించారు. రబీలో ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ వారంలోగా పూర్తి కావాలని చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశంలో జేసీ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం పౌర సరఫరాల శాఖ ద్వారా రైతుల నుంచి మార్కెట్ ధరతో కందులు కొనుగోలు చేస్తుందనే విషయాన్ని రైతులకు తెలియజేయాలన్నారు. కందుల కొనుగోలుకు సంబంధించి రైతు భరోసా కేంద్రాల్లో రైతులు తమ పేర్లను నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. తేమ, నాణ్యత ప్రమాణాలు పాటించేలా అవగాహన కల్పించాలని సూచించారు. పంట కొనుగోలు ఫిబ్రవరి వరకు కొనసాగిస్తామన్నారు. ఆర్‌బీకేల్లో విత్తనాలు, ఎరువులకు సంబంధించిన నగదు క్యూఆర్ కోడ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించే ఏర్పాటు చేయాలని అధికారులను జేసీ ఆదేశించారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

దళారులను నమ్మి రైతులు తమ పంటను తక్కువ ధరకు అమ్ముకుని మోసపోవద్దని జాయింట్ కలెక్టర్ సూచించారు. కందులను మార్కెట్ ధరతో గ్రామస్థాయిలోనే ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. అదే విధంగా కచ్చితమైన తూకం, వారంలోగా నగదును నేరుగా రైతుల ఖాతాల్లోకి జమ చేస్తుందన్నారు. కందులు సాగు చేసి ఈ-క్రాప్ నమోదైన రైతులు తమ పంట కొనుగోలు విషయంలో ఆర్‌బీకే సిబ్బంది లేదా వ్యవసాయ అధికారులను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యయసాయ అధికారి ఉమామహేశ్వరమ్మ, రేకులకుంట ఏఆర్ఎస్ ప్రధాన శాస్త్రవేత్త సహదేవరెడ్డి, నాబర్డ్ డీడీఎం అనురాధ, పశుసంవర్థక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం, ఉద్యాన శాఖ డీడీ రఘునాథ్‌రెడ్డి, ఏపీఎంఐపీ పీడీ ఫిరోజ్ ఖాన్, పౌర సరఫరాల సంస్థ డీఎం రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై అవగాహన

అనంతపురం అర్బన్: రోడ్డు భద్రతపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు విస్తృతస్థాయిలో కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ గౌతమి సూచించారు. రోడ్డు భద్రత మాసోత్సవాలను శనివారం నుంచి ఫిబ్రవరి 19 వరకు నిర్వహించాలని చెప్పారు. శుక్రవారం కలెక్టరేట్ రెవెన్యూ భవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రోడ్డు భద్రత మాసోత్సవాల బ్రోచర్లు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ హిట్ అండ్ రన్ మోటార్ వాహనాల ప్రమాదాల్లో బాధితులకు నష్టపరిహారం అందుతుందన్నారు. తీవ్రంగా గాయపడితే 'హిట్ అండ్ రన్ యాక్సిడెంట్- 2022' కింద నష్టపరిహారం రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్, జెడ్పీ సీఈఓ వైఖోమ్ నైదియాదేవి, నగర పాలక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్ఓ గాయత్రీదేవి, ఏఎస్పీ విజయభాస్కర్‌రెడ్డి, డీటీసీ వీర్రాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



ముద్దలాపురంలో బ్యాడిగి మిరపను గ్రేడింగ్ చేస్తున్న కూలీలు

మిరప మెరుపులు



మిరప పంట లాభదాయకంగా ఉండటంతో ఉరవకొండ నియోజకవర్గంలో చాలామంది రైతులు 'బ్యాడిగి' రకం సాగు చేస్తున్నారు. కూడేరు, ముద్దలాపురం, హావళిగి, పెంచలపాడు, చాబాలి, పొలికి గ్రామాల్లో మిరప దిగుబడి చేతికొచ్చింది. రైతులు పంటను తొలగించి పొలాల్లోనే ఆరబెడుతున్నారు. సమీప రోడ్లపైనా ఆరబెట్టి గ్రేడింగ్ చేస్తున్నారు. క్వింటాలు రూ.40 వేల నుంచి రూ.50 వేల దాకా పలుకుతోంది. వ్యాపారులు పొలాల వద్దకే వచ్చి రైతుల వద్ద మిరపను కొనుగోలు చేస్తున్నారు. అనంతపురం నుంచి ఉరవకొండ మీదుగా ప్రయాణం చేసే వారికి రోడ్డుపై ఎర్రటి మిరప రాశులు ఆకట్టుకుంటున్నాయి.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం



మిరప ఆరబోత



మిరప బస్తాలను వాహనంలోకి లోడ్ చేస్తున్న దృశ్యం

అంతర్రాష్ట్ర దొంగల అరెస్ట్

- 30 తులాల బంగారు నగలు, 920 గ్రాముల వెండి, 7 ద్విచక్ర వాహనాల స్వాధీనం
- మరో కేసులో 3.50 కిలోల గంజాయి స్వాధీనం
- వివరాలు వెల్లడించిన ఎస్పీ అన్బురాజన్



స్వాధీనం చేసుకున్న ఆభరణాలు, గంజాయిని చూపుతున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం: గుంతకల్లు పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని ఉరవకొండ రూరల్ పోలీసులు ముగ్గురు అంతర్రాష్ట్ర దొంగలను అరెస్ట్ చేసి రూ.30 లక్షల విలువైన బంగారు నగలు, వెండి సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. అలాగే మరో కేసులో ఏడుగురిని అరెస్ట్ చేసి, 3.50 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఎస్పీ అన్బురాజన్ వెల్లడించారు.

నిందితులు కర్ణాటక వాసులు

పట్టుబడిన అంతర్రాష్ట్ర దొంగల్లో కర్ణాటకలోని బాదామి జిల్లాకు చెందిన సతీష్‌గౌడ, కొప్పళ జిల్లాకు చెందిన రాజా సాహెబ్, గదగ్ జిల్లా నివాసి పరుశురాం ఉన్నారు. వీరి వద్ద నుంచి 30 తులాల బంగారు నగలు, 920 గ్రాముల వెండి సామగ్రి, ఓ కారు, ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ ముగ్గురిపై ఇప్పటికే పలు కేసులున్నాయి. ఈ బృందంలో సతీష్‌గౌడ అత్యంత కీలకమైన సభ్యుడు. ఏడాది క్రితం కర్ణాటకలోని చిత్రదుర్గ జైలులో రాజా సాహెబ్, పరుశురామ్‌కు సతీష్ గౌడ పరిచయమయ్యాడు.

హౌస్ బ్రేకింగ్‌లో దిట్టలు

గత ఏడాది జనవరిలో జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత ముగ్గురూ కలసి తాళం వేసిన లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు తెగబడ్డారు. బెళుగుప్ప, ఉరవకొండ, రాయదుర్గం, గుంతకల్లు, గుత్తి, బొమ్మనహాళ్ ప్రాంతాలతో పాటు కర్ణాటకలోని రాయచూరు, బీజాపూర్‌లో యథేచ్ఛగా హౌస్ బ్రేకింగ్‌లకు పాల్పడ్డారు. ఈ క్రమంలో గుంతకల్లు డీఎస్పీ నర్శింగప్ప పర్యవేక్షణలో ఉరవకొండ రూరల్ సీఐ ప్రవీణ్‌కుమార్, బెళుగుప్ప ఎస్‌ఐ శివ, కానిస్టేబుళ్ల బృందాలుగా విడిపోయి దర్యాప్తు వేగవంతం చేశారు. బెళుగుప్ప మండలం ఎస్.గుండ్లపల్లి క్రాస్ వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న సతీష్‌గౌడ, రాజా సాహెబ్, పరుశురాంను అదుపులోకి తీసుకుని తమదైన శైలిలో విచారణ చేయడంతో హౌస్ బ్రేకింగ్‌ల గుట్టు రట్టయింది. శుక్రవారం నిందితులపై కేసు నమోదు చేసి, రూ.30 లక్షల విలువైన బంగారు నగలు, వెండి సామగ్రితో పాటు ఓ కారు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుల అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని అభినందిస్తూ ఎస్పీ రివార్డులు అందజేశారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్ట్

ద్విచక్ర వాహనాలను అపహరించే ఓ దొంగను అరెస్ట్ చేసి రూ.2.50 లక్షలు విలువ చేసే ఆరు వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పీ అన్బురాజన్ తెలిపారు. శుక్రవారం ఉదయం గుంతకల్లులోని రైల్వే స్టేషన్ కూడలి బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా తచ్చాడుతున్న పాత గుంతకల్లు నివాసి తిమ్మప్పను సీఐ రామసుబ్బయ్య అదుపులోకి తీసుకుని విచారణ చేయడంతో ద్విచక్ర వాహనాల అపహరణ అంశం వెలుగు చూసింది. కూలి పనులతో జీవనం సాగిస్తున్న తిమ్మప్ప... జల్సాలకు అలవాటు పడి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లడం మొదలుపెట్టాడు. అపహరించుకెళ్లిన వాహనాలను విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా పోలీసులు గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి ముఠా అరెస్ట్

నగరంలో కొంత కాలంగా గంజాయి విక్రయిస్తున్న ముఠా సభ్యులను వన్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి 3.50 కిలోల గంజాయితో పాటు మట్కా పట్టీలు, రూ.9,83,300 నగదు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఎస్పీ అన్బురాజన్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. పట్టుబడిన వారిలో అనంతపురంలోని వేణుగోపాల్ నగర్‌కు చెందిన సి.చలపతి, సి.గోవిందరాజులు, ఎన్‌టీఆర్ కాలనీకి చెందిన షికారి సుధాకర్, షికారి బాలచంద్ర, అశోక్‌నగర్ నివాసి పి.సెల్వా గణపతి, బుక్కరాయసముద్రం మండలం వీరభద్ర కాలనీకి చెందిన నాగయ్య, కక్కలపల్లి కాలనీ ఆదర్శనగర్ నివాసి కొత్తకాపు జయసుధ ఉన్నారు. వీరిలో చలపతి, గోవిందరాజులు మట్కా నిర్వహణతో పాటు గంజాయి విక్రయాలు సాగించేవారు. పట్టుబడిన ఏడుగురిలో ఐదుగురు గంజాయి విక్రయాలు సాగిస్తున్నారు. విశాఖ ఏజెన్సీ నుంచి గంజాయిని జిల్లాకు జయసుధ చేరిస్తే... మిగిలిన వారు చిన్న పొట్లాలుగా మార్చి విక్రయించేవారు. అందిన పక్కా సమాచారంతో అప్రమత్తమైన సీఐ రెడ్డప్ప, సిబ్బంది శుక్రవారం నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి ముఠా అరెస్ట్‌లో చొరవ చూపిన సిబ్బందిని ఎస్పీ అభినందిస్తూ రివార్డులు అందజేశారు. సమావేశంలో గుంతకల్లు డీఎస్పీ నర్శింగప్ప, జిల్లా స్పెషల్ బ్రాంచి, ఉరవకొండ రూరల్, గుంతకల్లు, అనంతపురం వన్‌టౌన్ సీఐలు జాకీర్ హుస్సేన్, ప్రవీణ్‌కుమార్, రామసుబ్బయ్య, రెడ్డప్ప, బెళుగుప్ప ఎస్‌ఐ శివ పాల్గొన్నారు.

క్లుప్తంగా

జూదరుల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని గోళ్ల గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో శుక్రవారం పేకాట (మంగాపత్తా) ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్ట్ చేసి, రూ.2.25 లక్షల నగదు, 4 ద్విచక్ర వాహనాలు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు డీఎస్పీ శ్రీనివాసులు, రూరల్ సీఐ ఎన్‌వీ నాగరాజు తెలిపారు.

ప్రమాదంలో వ్యక్తి మృతి



నంజిరెడ్డి (ఫైల్)

చిలమత్తూరు: మండల సరిహద్దున 44వ జాతీయ రహదారిపై కర్ణాటక ఆదేపల్లి వద్ద చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... చిలమత్తూరు మండలం సోమఘట్ట పంచాయతీ చెరువుకిందపల్లికి చెందిన ఎ.నంజిరెడ్డి(37) వ్యక్తిగత పనిపై శుక్రవారం ఉదయం బాగేపల్లికి వెళ్లాడు. పని ముగించుకుని సాయంత్రం తిరుగు ప్రయాణమైన ఆయన కర్ణాటక ఆదేపల్లి సమీపంలోని పెట్రోల్ బంక్ వద్దకు చేరుకోగానే వెనుక నుంచి వేగంగా దూసుకొచ్చిన వాహనం ఢీకొంది. ఘటనలో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ప్రమాదానికి కారణమైన డ్రైవర్ వాహనంతో పాటు ఉడాయించాడు. సమాచారం అందుకున్న చిలమత్తూరు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు. కాగా, మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ
బుడ్డప్పనగర్, అనంతపురము

టెండరు ప్రకటన

స్టేజి-2 రవాణా కాంట్రాక్టర్ నియామకము కొరకు
ఆహార ధాన్యములు మరియు ఇతర నిత్యావసర వస్తువులు రవాణా నిమిత్తం

నెం. పి.డి.యస్./స్టేజ్-2/2023-2025. తేది : 17-01-2024

[illegible]

క్రమ సంఖ్య	నెలవారి కేటాయింపు మెట్రిక్ టన్నులలో	ధరావత్తు సొమ్ము రూ.	సెక్యూరిటీ డిపాజిట్ రూ.
1	Upto 500 MTs	50,000/-	3,25,000/-
2	Upto 500 MTs to 800 MTs	75,000/-	4,00,000/-
3	800 MTs & above	1,00,000/-	6,00,000/-

టెండరు ఫారం అమ్మకం	టెండరు దాఖలుకు ఆఖరి తేది	టెండరు తెరుచు తేది
17-01-2024 నుండి 29-01-2024 సాయంత్రం 05-00 గం॥ల వరకు అన్ని పనిదినములలో	29-01-2024 ఉదయం 10 గం॥ల నుండి మధ్యాహ్నము 2 గం॥ల వరకు	29-01-2024 మధ్యాహ్నము 3 గంటలకు / Office of the DMO

[illegible] "A.P.S.C.S.C, Ananthapuramu" [illegible] రూ॥ 10,000/- [illegible]

సం/- జిల్లా సంయుక్త కలెక్టర్ మరియు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ, అనంతపురము.

నేడు మార్కెట్ సుంకాల బహిరంగ వేలం

ధర్మవరం: ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ సుంకాల వేలంపాటను శనివారం నిర్వహించనున్నామని కమిషనర్ బండి శేషన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట ప్రారంభం అవుతుందని పేర్కొన్నారు. వేలంలో పాల్గొనే వారు ధరావతుచెల్లించి, సాల్వెన్సీ సర్టిఫికెట్, మున్సిపల్ లీజ్ గెజిట్ నోటిఫికేషన్‌లోని షరతులను అంగీకరించి వేలంపాటలో పాల్గొనాలని సూచించారు. సాల్వెన్సీ సర్టిఫికెట్ దాఖలు పరచనివారు రూ.40 లక్షలు డిపాజిట్‌గా మున్సిపల్ ఖజానాకు చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు. వేలంలో పాల్గొనేవారు వారికి సంబంధించిన ఇంటి పన్నులు, నీటి పన్నులు ఎలాంటి బకాయిలు లేకుండా చెల్లించి ఉండాలన్నారు. వేలంపాట దక్కించుకున్న హక్కుదారులు వేలంపాట మొత్తాన్ని ఏడు రోజుల్లోపు చెల్లించాలన్నారు. అలా చెల్లించని పక్షంలో డిపాజిట్ మొత్తం మున్సిపల్ నిధులకు జమ చేసుకుని తిరిగి వేలంపాటను నిర్వహిస్తామని వెల్లడించారు. మార్కెట్ ఏరియాలో శుభ్రపరుచుటకు నియమించిన స్వీపర్లను నెలవారి జీతభత్యాలు గుత్తేదారులే భరించాలని తెలిపారు. దినవారపు మార్కెట్ వేలం, జంతువధశాల సుంకాల వేలం పాట రెండూ నిర్వహిస్తామన్నారు.

'వేధింపుల' కేసు నమోదు

తాడిపత్రి అర్బన్: అదనపు కట్నం కోసం భార్యను వేధింపులకు గురి చేస్తున్న భర్త, ఆయన కుటుంబీకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. తాడిపత్రిలోని టైలర్స్ కాలనీకి చెందిన కోన సౌజన్యకు 2022లో రాజేష్‌రెడ్డితో వివాహమైంది. భర్త రాజేష్‌రెడ్డి పనీపాట చేయకుండా ఖాళీగా ఉంటున్నాడు. ఈ క్రమంలోనే అదనపు కట్నం తీసుకురావాలంటూ సౌజన్యను వేధించడం మొదలు పెట్టాడు. విషయాన్ని అత్త, మామకు తెలిపితే వారు కూడా రాజేష్‌రెడ్డికే వత్తాసు పలికారు. పుట్టింటికెళ్లి అదనపు కట్నం తీసుకురావాలని ఒత్తిడి పెంచారు. దీంతో దిక్కుతోచని స్థితిలో సౌజన్య శుక్రవారం తాడిప్రతి అర్బన్ పోలీసులను ఆశ్రయించింది. విచారణ అనంతరం బాధితురాలి ఫిర్యాదు మేరకు రాజేష్‌రెడ్డి, ఆయన కుటుంబీకులపై 498ఏ సెక్షన్ కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

వేమన అడుగుజాడలు అనుసరణీయం



వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ కేతన్‌గార్గ్, ఎస్పీ అన్బురాజన్

- జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్

అనంతపురం అర్బన్: ప్రజాకవి యోగి వేమన అడుగుజాడలు అనుసరణీయమని జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన వేమన జయంతి కార్యక్రమంలో జేసీ పాల్గొని వేమన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటు చేసి సభలో మాట్లాడారు. 'విశ్వదాభిరామ వినురవేమ' అనే మకుటంతో వేమన రాసిన పద్యాలు తెలుగువారికి సుపరిచితమన్నారు. పామరులకూ అర్థమయ్యే భాషలో పద్యాలు చెప్పి ప్రజలను మెప్పించారన్నారు. వేమన పద్యాల్లో లోక నీతులు, సామాజిక చైతన్యం పుష్కలంగా ఉందన్నారు. కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో...

అనంతపురం క్రైం: జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం వేమన జయంతిని ఘనంగా నిర్వహించారు. వేమన చిత్రపటానికి ఎస్పీ అన్బురాజన్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమాజంలో పాతుకుపోయిన మూఢనమ్మకాలను పారదోలేందుకు వేమన చేసిన కృషిని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో నేటి యువత ఉన్నత భావాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు ఆర్.విజయభాస్కర రెడ్డి, జి.రామకృష్ణ, ఎ.హనుమంతు, డీసీఆర్‌బీ సీఐ విశ్వనాథ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

యువకుడి మృతి

గార్లదిన్నె: మండలంలోని రామ్‌దాస్‌పేట గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై చోటు చేసుకున్న ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. ఈ మేరకు ఎస్‌ఐ సాగర్ తెలిపారు. ఎగువపల్లికి చెందిన నిరంజన్‌రెడ్డి (27) వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి కర్నూలులోని ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పరిస్థితి విషమించడంతో గురువారం రాత్రి ఆయన మృతి చెందాడు. ఘటనపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

జనవాక్కు

చేసిన మేలును ఎన్నటికీ మరువం



సీఎం వైఎస్ జగనన్న చేసిన మేలును ఎన్నటికీ మరచిపోలేం. నా కుటుంబానికి రైతు భరోసా పథకం కింద ఏటా 13,500 అందుతోంది. స్థానిక జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి చదువుతున్న నా కుమార్తెకు అమ్మ ఒడి పథకం వర్తించింది. జగనన్న కాలనీలో ఇంటి స్థలం మంజూరు చేశారు. గృహ నిర్మాణం సాగుతోంది. త్వరలో సొంతింట్లోకి పోతున్నాం. గతంలో ఎన్నడూ ఇంతలా సంక్షేమ పథకాలను అందుకోలేదు. మరో 30 ఏళ్ల పాటు ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే ఉండాలని కోరుకుంటున్నాం.

– ఆర్.రవీంద్ర, కొనకొండ్ల, వజ్రకరూరు మండలం

ఇంగ్లిష్ చదువులు దగ్గర చేశారు



పేదరికం కారణంగా నా కుమారుడు భార్గవ్‌నాయక్‌ను ప్రైవేట్ ఇంగ్లిష్ మీడియం స్కూలులో చేర్పించలేకపోయా. చాలాసార్లు ఇంగ్లిష్ మీడియంలో చదువుకుంటానని అడిగేవాడు. నా ఆర్థిక పరిస్థితి బాగాలేదని నచ్చచెప్పేవాడ్ని. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ ప్రభుత్వ బడుల్లోనూ ఇంగ్లిష్ మీడియం చదువులు చెప్పిస్తున్నారు. దీంతో నా కుమారుడి కల సాకారమైంది. అంతేకాక ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా మా ఊళ్లో బడి రూపురేఖలు మారిపోయాయి. కోటి రూపాయలు ఖర్చు పెట్టి అదనపు గదులు నిర్మించారు. స్కూల్ వాతావరణం చాలా బాగుండడంతో రోజూ క్రమం తప్పకుండా పిల్లలంతా బడికి పోతున్నారు. సీఎం వైఎస్ జగన్‌తోనే మా పిల్లలకు నాణ్యమైన చదువులు చేరువ అయ్యాయి. ఆయనే కలకాలం ముఖ్యమంత్రిగా ఉండాలని కోరుకుంటున్నా.

– రమేష్‌నాయక్, విద్యార్థి తండ్రి, కూడేరు

వ్యక్తి ఆత్మహత్య



హనుమప్ప (ఫైల్)

కళ్యాణదుర్గం రూరల్: మతిస్థిమితం లేని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కళ్యాణదుర్గం మండలం గరుడాపురానికి చెందిన బోయ హనుమప్ప (40) కొంత కాలంగా మతిస్థిమితం లేక బాధపడుతున్నాడు. కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి పెంచుకున్న హనుమప్ప శుక్రవారం ఉదయం గ్రామ శివారులోని చింత చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. అటుగా వెళ్లిన వారు గుర్తించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులు, పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. కాగా, మృతుడికి భార్య చిత్రమ్మ, ఓ కుమారుడు, కుమార్తె ఉన్నారు.

యువకుడి దుర్మరణం

పెనుకొండ రూరల్: ద్విచక్ర వాహనం అదుపుతప్పి కిందపడి ఓ యువకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు.... హిందూపురం మున్సిపల్ పరిధిలోని ముదిరెడ్డిపల్లికి చెందిన మధు (21), మరికొందరు శుక్రవారం ఉదయం ద్విచక్ర వాహనాలపై పెనుకొండ కోట సందర్శనకు వచ్చాడు. రాత్రి తిరుగు ప్రయాణమైన వారు పులేకమ్మ ఆలయం వద్ద వేగంగా దూసుకెళుతూ ఒకరి వాహనాన్ని మరొకరు ఓవర్ టేక్ చేసే క్రమంలో మధు నడుపుతున్న వాహనం అదుపు తప్పి కిందపడింది. ఘటనలో తల పగిలి మధు అక్కడికక్కడే మృతిచెందాడు. మరో యువకుడు శీలా సంతోష్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న ఏఎస్‌ఐ మారుతి అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

అరటి గెలల నరికివేత

పుట్లూరు: కుమ్మనమల గ్రామానికి చెందిన ఓ రైతుకు చెందిన అరటి తోటలో గెలలను గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. వివరాలు.. ఓబన్న ఐదెకరాల్లో అరటి సాగు చేశాడు. తోటలో 600 అరటి గెలలను గుర్తు తెలియని వ్యక్తులు నరికేసినట్లు శుక్రవారం ఉదయం గుర్తించాడు. సంఘటనా స్థలాన్ని సీఐ సుబ్రహ్మణ్యం, ఎస్‌ఐ దిలీప్‌కుమార్ పరిశీలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.


వృద్ధుడి అదృశ్యం



శ్రీరాములు

గుత్తి రూరల్: బ్రాహ్మణపల్లికి చెందిన ఓ వృద్ధుడు అదృశ్యమయ్యాడు. ఎస్‌ఐ నబీ రసూల్ తెలిసిన వివరాలు.. గ్రామానికి చెందిన శ్రీరాములు ఈ నెల 17న రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబ సభ్యులు తెలిసిన చోటల్లా వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధుడి కుటుంబ సభ్యులు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. శ్రీరాములు ఆచూకీ తెలిసిన వారు తమకు సమాచారం అందించాలని ఎస్‌ఐ కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం




స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న ఎస్‌ఐ

కూడేరు: మండలంలోని పి.నాగిరెడ్డిపల్లిలో శుక్రవారం ఎస్‌ఐ సత్యనారాయణ సిబ్బందితో కలసి సోదాలు చేపట్టారు. ఈ సందర్భంగా సూరప్ప అనే వ్యక్తి ఇంట్లో కర్ణాటక మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్‌ఐ మాట్లాడుతూ ఎవరైనా అక్రమంగా మద్యాన్ని విక్రయిస్తే ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

ఉద్యోగాల పేరుతో కుచ్చుటోపీ

- 56 మందితో రూ.75.95 లక్షల వసూలు
- సీమాక్ కంపెనీలో ఉద్యోగం అంటూ నకిలీ ఆఫర్ లెటర్ల అందజేత
- పరారీలో మోసగాళ్లు
- బాధితుల ఫిర్యాదుతో కేసు నమోదు



బత్తలపల్లి: ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నమ్మించి రూ.లక్షలు వసూలు చేసుకుని ఉడాయించిన ఘటన సంచలనం రేకెత్తించింది. బాధితుల ఫిర్యాదుతో ఘరానా మోసం వెలుగు చూసింది. పోలీసులు తెలిపిన మేరకు... అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లికి చెందిన దేరంగుల రమాకాంత్ ఎంటెక్ పూర్తి చేశాడు. దాదాపు ఐదేళ్ల పాటు మదనపల్లిలోని శ్రీసాయినాథ డిగ్రీ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేశాడు. ఈ క్రమంలో చాలా మంది డిగ్రీ, బీటెక్ విద్యార్థులు పరిచయమయ్యారు.

బత్తలపల్లికి మకాం మార్చి..

లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి 8 నెలల క్రితం బత్తలపల్లిలోని యల్లమ్మ వీధికి మకాం మార్చిన రమాకాంత్... స్థానికుడు కుంచపు నల్లప్పతో కలసి పెయింటింగ్ కాంట్రాక్టర్‌గా చుట్టు ప్రక్కల గ్రామాలలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో తనకు పరిచయమున్న డిగ్రీ, బీటెక్ విద్యార్థులు చదువులు పూర్తి చేసుకుని ఉద్యోగాన్వేషణలో ఉంటూ రమాకాంత్‌ను కలసి ఎక్కడైనా సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు ఖాళీగా ఉంటే తెలపాలని కోరారు. ఇదే విషయాన్ని కుంచపు నల్లప్పకు రమాకాంత్ వివరించాడు. ఆ సమయంలోనే నిరుద్యోగులను మోసం చేసి సులువుగా డబ్బు సంపాదించేలా ఇద్దరూ కలసి పథకం రూపొందించారు.

సీమాక్ కంపెనీలో ఉద్యోగం అంటూ..

ఈ క్రమంలోనే తనను సంప్రదించిన దాదాపు 53 మంది నిరుద్యోగులను గత ఏడాది ఏప్రిల్‌లో బత్తలపల్లిలోని నల్లప్ప ఇంటికి రమాకాంత్ పిలుచుకెళ్లాడు. బెంగళూరులోని సీమాక్ టెక్నాలజీలో తన సమీప బంధువు కుంచపు కృష్ణమూర్తి, వరల్డ్ ట్రేడ్ సెంటర్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న గుంటూరు జిల్లా పెద్ద కాకానికి చెందిన వనపూరి సతీష్‌కుమార్, గుంటూరు నివాసి బీవీఎస్‌ఆర్ కృష్ణారెడ్డితో తనకు మంచి సంబంధాలున్నాయని, వారి ద్వారా సీమాక్ కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ నల్లప్ప తెలిపాడు. ఇందుకు ముందస్తుగా డబ్బు చెల్లించాల్సి ఉంటుందని నమ్మబలికాడు. దీంతో ఒక్కొక్కరు రూ.1.25 లక్షలు చొప్పున 49 మంది, మరో ఏడుగురు రూ.2.10 లక్షలు (ఒక్కొక్కరు) చొప్పున మొత్తం రూ.75.95 లక్షలు పోగు చేసి ఇచ్చారు. ఈ మొత్తంలో కొంత సతీష్‌కుమార్, కృష్ణారెడ్డి ఫోన్‌పే ఖాతాకు బదిలీ చేయగా, మరికొంత నగదు రూపంలో చెల్లించారు.

నకిలీ ఆఫర్ లెటర్లతో మోసం

తమకు డబ్బు చెల్లించిన వారిని గత ఏడాది మే 18న పిలిపించుకున్న రమాకాంత్, నల్లప్ప వారికి... ఐడీ కార్డులు, ఆఫర్ లెటర్లు, కొందరికి ల్యాప్‌టాప్‌లు అందజేశారు. సీమాక్ కంపెనీలో ఉద్యోగాలు వచ్చినట్లుగా పేర్కొన్నారు. వర్క్‌ఫ్రం హోం అని నమ్మించి పంపారు. ఓ నెల తర్వాత ఒక్కొక్కరికి రూ.15 వేలు చొప్పున జీతం అందజేశారు. తర్వాత బెంగుళూరులో సీమాక్ టెక్నాలజీ కంపెనీ తీసేసారంటూ చెప్పి ముఖం చాటేశారు. ఆఫర్ లెటర్లను పట్టుకుని తమకు తెలిసిన వారి ద్వారా ఆరా తీస్తే అవి నకిలీవని తేలడంతో తాము మోసపోయినట్లుగా నిరుద్యోగులు గుర్తించారు. రమాకాంత్, నల్లప్ప కోసం గాలించినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బాధితులు శుక్రవారం బత్తలపల్లి పోలీసులను కలసి ఫిర్యాదు చేశారు. ఘటనపై ఏఎస్‌ఐ సోమశేఖరమూర్తి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

కారును ఢీకొన్న బస్సు

- తొమ్మిది మందికి గాయాలు

శింగనమల: మండలంలోని చక్రాయిపేట సమీపంలో శుక్రవారం కారు, ఆర్టీసీ బస్సు ఢీకొన్నాయి. ఘటనలో తొమ్మిది మంది గాయపడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురంలో నివాసముంటున్న ఉపాధ్యాయులు ఆనందరావు, మాధవ... వారి కుటుంబసభ్యులు ఆరుగురితో కలసి శుక్రవారం ఉదయం యాగంటి క్షేత్ర దర్శనానికి బయలుదేరారు. చక్రాయిపేట వద్దకు చేరుకోగానే విజయవాడ నుంచి హిందూపురానికి వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఘటనలో ఆనందరావు, మాధవ, వారి కుటుంబసభ్యులతో పాటు డ్రైవర్ గాయపడ్డారు. క్షతగాత్రులను వెంటనే 108 అంబులెన్స్ ద్వారా అనంతపురంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. గాయపడిన వారిలో భావన, నవ్యశ్రీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఘటనపై ఎస్‌ఐ చంద్రశేఖర్ కేసు నమోదు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

DISTANCE EDUCATION
■ ఆంధ్ర యూనివర్సిటీ & ANU అడ్మిషన్స్ జరుగుచున్నవి B.A, B.Com, B.Sc, (TM/EM) (All Groups), M.A, M.Com, M.Sc (All Subjects) M.B.A, M.S.W, B.Li.Sc, M.Li.Sc. డా॥ బి. మధుసూధన. ఫోన్ : 83282 79245. [V- 6372]

ONE SITTING
■ One Sitting, 10th, 12th, B.A., B.Com., B.Sc., M.A., M.Com., M.Sc, MBA, BBA, BCA, B.Tech, Diploma, Agriculture, Pharmacy, Nursing (for dropouts / backlogs) from UGC recognised universities. Exams in February / March. Cont : 73383 76874 [R-306]

REAL ESTATE

FOR RENT
■ ATP, సాయి నగర్ మెయిన్ రోడ్ నందు, 800 చ.అ. కమర్షియల్ స్పేస్, సెల్లార్ ఫ్లోర్ లో బాడుగకు కలదు. ఫైనాన్స్, చిట్స్, ఏజెన్సీ ఆఫీస్‌లకు అనువైనది. సెల్ : 99490 59834. [A-1533]

TOLET
■ అనంతపురము, రుద్రంపేట, మేథ హాస్పిటల్ ఎదురుగా, గ్రౌండ్‌ఫ్లోర్‌లో 1 BHK ఇల్లు నీటి వసతితో అద్దెకు కలదు. ఫోన్ : 92916 40096. [A-784530]

గోడౌన్ బాడుగకు
■ అనంతపురము టౌన్, నాయక్ నగర్ రైల్వే గేట్ దగ్గర 1800 చ॥అ॥ గల గోడౌన్ అన్ని సదుపాయాలతో బాడుగకు కలదు. సెల్ : 9849004785, 8919265534. [A-784531]

2BHK FOR RENT
■ ATP, KLD రోడ్, Opp. ద్వారకా విల్లాస్, 2 BHK, POP, ఉడ్ వర్క్, కార్ పార్కింగ్, RO వాటర్ సౌకర్యాలతో న్యూ హౌస్ (రెడీ టు ఆకుపై) బాడుగకు ఇవ్వబడును. (రెంట్ : 13 వేలు) సెల్ : 8074098431. [A-784532]

LEASE / RENT
■ గుత్తి-గుంతకల్ మధ్యన, నేషనల్ హైవేకి @ పాత కొత్తచెరువు 1000 చ.అ గల షెడ్+ 75 సెంట్ల ఓపెన్ పార్కింగ్ ప్లేస్, దాబా హోటల్స్/ గోడౌన్/ వర్క్ షాప్స్ కి లీజ్/రెంట్‌కి ఇవ్వబడును. 9449986123, 9347039123. [A-3001]

స్థలం అమ్మబడును
■ 20 Cents కార్నర్ Plot నందు 30000 sq.ft. నిర్మించబడి నెలకు 3 ½ లక్షల బాడుగ వచ్చుచున్న 5 అంతస్తుల బిల్డింగ్ Housing bard (New Rev Col) నందు అమ్మకమునకు కలదు. ఫోన్ : 94405 66667. [A-7391]

FLATS FOR SALE
■ Red Rock Rubyx Apartments, New Revenue Colony, RTO Office Road, Besides Sri Chaitanya School, Anantapur Town.1250 Sq.ft luxuriously planned, well ventilated, amazing Infra Structure and Amenities. Occupation by April 2024. Contact Number: 9908887674. [A-7393]

REAL ESTATE
■ మన అనంతపురంలో 7.5ల॥ పెట్టుబడితో (25సెంట్లు) 10సం॥ వ్యవధిలో కోటి రూ॥ వరకు ఆదాయం పొందవచ్చు లీగల్‌గా ఎగ్రిమెంటుతో పెట్టుబడి పెట్టదలచుకున్నవారు. 9010007599 [G-824251]

WANTED
■ అనంతపురములో ప్రముఖ ఫైనాన్స్ కంపెనీ నందు జాబ్ చేయడానికి Male / Females కావలెను. సంప్ర: జి. మురళీ, సెల్ : 90306 61651, అనంతపురము. [A-3003]
■ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం. జీ: 18K. Ph: 9160900024 / 9640400073 [HA-1109]
■ Wanted Experienced Female Staff to teach Maths subject for Primary classes in Blossoms School, ATP, Cell:9030777676. [C-777300]

■ ప్రముఖ కార్పొరేట్ ప్రై.లి. కంపెనీలో వర్క్ చేయుటకు ఫీల్డ్ వర్కర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, FRANCHISE కొరకు సంప్రదించండి : 90009 77523. [A-3004]
■ వృద్ధాశ్రమములో పనిచేయుటకు వర్కర్లు కావలెను. ఉచిత భోజనము వసతితో పాటు జీతము ఇవ్వబడును. సంప్ర : 96520 61377, 80746 15073. [A-1534]
■ అనంతపురం నగరంలోని ప్రముఖ పాలిటెక్నిక్ కళాశాలలో అధ్యాపకులుగా పనిచేయుటకు ఈసీఈ / మెకానికల్ లో బీటెక్ / ఎంటెక్ పూర్తి చేసినవారు, ట్యూటర్‌గా పనిచేయుటకు బీఎస్సీ / ఎమ్మెస్సీ పూర్తి చేసినవారు & కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు బీకాం కంప్యూటర్ పూర్తి చేసి + టైపింగ్ + ఎమ్మెస్ ఆఫీస్ బాగా వచ్చినవారు కావలెను. సెల్ : 8886621125 / 26 / 28. [A-1548]
■ Paytm కంపెనీలో పనిచేయుటకు ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు (ఆన్‌రోల్) కావలెను. అర్హత : 10th, ఇంటర్, డిగ్రీ. జీతం + ఇన్సెంటివ్స్ = Rs. 30,000. # అనంతపురం : 9441945743, తాడిపత్రి: 9642735547, కళ్యాణదుర్గం+రాయదుర్గం : 9959090442, హిందూపురం + కదిరి: 9866419866, గుంతకల్ + గుత్తి : 9848555198, ధర్మవరం : 9676540905, పుట్టపర్తి : 9160730935. [A-784529]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

వేమన సాహిత్యం చిరస్మరణీయం


వేమన విగ్రహానికి పూలమాల వేస్తున్న డిప్యూటీ మేయర్ కోగటం


మాట్లాడుతున్న ఎస్కేయూ వీసీ ప్రొఫెసర్ హుస్సేన్ రెడ్డి


తగరకుంటలో యోగి వేమన జయంతి కార్యక్రమంలో పాల్గొన్న రెడ్డి జేఏసీ నాయకులు

అనంతపురం కల్చరల్: సమాజాన్ని సంస్కరణ దిశగా నడిపించిన ప్రజాకవి యోగి వేమన సాహిత్యం చిరస్మరణీయమని విశ్రాంత వైస్ చాన్సలర్ ఆచార్య కాడా రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేమన ఫౌండేషన్ ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి ఘనంగా జరిగింది. వంద పాఠశాలల్లో వేమన పద్యాల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించారు. స్థానిక వేమన ఫౌండేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమానికి కాడా రామకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. విశ్రాంత జాయింట్ కలెక్టర్ మనోహరరెడ్డి, సంస్థ కార్యదర్శి డాక్టర్ అప్పిరెడ్డి హరినాథరెడ్డి తదితరులు మాట్లాడారు. వేమన స్ఫూర్తిదాయక జీవితాన్ని, ఈ తరం వారు వేమన పద్యాలను పఠించాల్సిన అవసరాన్ని గుర్తు చేశారు. అంతకు ముందు వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విశ్రాంత రిజిస్ట్రార్ రవీంద్రరాజు, ఆచార్య రవీంద్రారెడ్డి, కవులు నబీ రసూల్, మధురశ్రీ, ఫౌండేషన్ సభ్యులు జలీల్ అహ్మద్, లోకన్న, నాగేశేషారెడ్డి, రామమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వేమన సాహిత్యంతో సామాజిక రుగ్మతలు దూరం

అనంతపురం: సామాజిక రుగ్మతలను రూపుమాపేలా యోగి వేమన సాహిత్యం దోహదపడుతుందని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ కే.హుస్సేన్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎస్కేయూలో విశ్వకవి యోగివేమన జయంతి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి వీసీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. యోగివేమన రచనలతో నాటి సామాజిక దురాచారాలను రూపుమాపారన్నారు. సమాజంలో మానవ విలువలు, మంచి నడవడిక, సంస్కారం పెంపొందించడానికి ఆయన చేసిన కృషి వెలకట్టలేనిదన్నారు. వేమన గురించి, ఆయన రచనలపై సమగ్ర పరిశోధనలు జరగాలని కోరారు. ప్రధాన వక్త డాక్టర్ పతికి రమేష్ నారాయణ మాట్లాడుతూ వేమన పద్యాలు చీకట్లను పారదోలే వెలుగులాంటివి అన్నారు. వేమన సాహిత్యం ఇప్పటికీ సజీవంగా నిలిచి ఉండడానికి సీపీ బ్రౌన్ లాంటి మహనీయుల కృషి మరువలేనిదన్నారు. కార్యక్రమంలో సదస్సు సమన్వయకర్త డాక్టర్ ఎంపీ లక్ష్మయ్య, ప్రిన్సిపాల్ కృష్ణకుమారి, కన్వీనర్ ప్రొఫెసర్ జి.బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

వేమన పద్యాలు చిరకాలం నిలిచి ఉంటాయి:

తెలుగు భాష బతికి ఉన్నంత కాలం వేమన పద్యాలు నిలిచి ఉంటాయని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్ పర్సన్ ఎల్ఎం ఉమాదేవి అన్నారు. వేమన జయంతిని పురస్కరించుకుని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో యోగివేమన చిత్రపటానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎల్ఎం మోహన్‌రెడ్డి, సిబ్బంది శివశంకర ప్రసాద్, రామాంజినమ్మ, రవికుమార్ నాయుడు, ప్రతాప్ రెడ్డి, గోవింద, కృష్ణయ్య, మల్లికార్జున, కావేరి, బాలచంద్ర తదితరులు పాల్గొన్నారు.

- జేఎన్‌టీయూ అనంతపురంలోని నూతన పాలక భవనంలో యోగి వేమన చిత్రపటానికి రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సి.శశిధర్ నివాళి అర్పించారు. కార్యక్రమంలో వర్సిటీ డైరెక్టర్లు ప్రొఫెసర్ ఈ.కేశవ రెడ్డి, ప్రొఫెసర్ సి. ఈశ్వర్ రెడ్డి, ప్రొఫెసర్ కిరణ్మయి, ప్రొఫెసర్ వీబీ చిత్ర, ప్రొఫెసర్ పద్మ సువర్ణ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్వీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఈ. అరుణకాంతి పాల్గొన్నారు.

సంఘ సంస్కర్త యోగివేమన

అనంతపురం టవర్‌క్లాక్: విశ్వకవి భారత తొలి సంఘ సంస్కర్త యోగి వేమన అని డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్ట్స్ కళాశాల ఎదురుగా విశ్వకవి యోగి వేమన కాంస్య విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ యోగి వేమన జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని నగరంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆనాడే ఆయన పద్యాలతో ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అనంత చంద్రారెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, నారాయణరెడ్డి, వేమన రెడ్డి సేవా సంఘం అధ్యక్షుడు నారాయణరెడ్డి, ప్రధాన కార్యదర్శి కొత్త విశ్వనాథరెడ్డి, కోశాధికారి గోపాల్ రెడ్డి, సూర్య నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, రూట్స్ స్కూల్ గోపాల్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, కవి సాహిత్య వేదిక అశ్వర్థ రెడ్డి, రెడ్డి సంఘం నాయకులు కసిరెడ్డి శ్రీనివాసరెడ్డి, బయపరెడ్డి, రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంచిని మేల్కొల్పిన మహాకవి యోగి వేమన

కనగానపల్లి: తన పద్యాలు, సాహిత్యం ద్వారా సమాజంలో మంచిని మేల్కొలిపిన మహాకవి యోగి వేమన అని రెడ్డి జేఏసీ జిల్లా ఉపాధ్యక్షుడు కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని తగరకుంటలో యోగివేమన జయంతి కార్యక్రమం నిర్వహించారు. స్థానిక రామాలయం వద్ద యోగి వేమన చిత్ర పటానికి జ్యోతిప్రజ్వలన చేసి పూజలు నిర్వహించారు. రెడ్డి జేఏసీ సంఘం నాయకులు మాట్లాడుతూ యోగివేమన ఆశయాలను తెలియజేసేలా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రెడ్డి జేఏసీ సంఘం నాయకులు మహేశ్వరరెడ్డి, శ్రీనివాసులురెడ్డి, కృష్ణారెడ్డి, అంజన్‌రెడ్డి, సదానంద రెడ్డి, దేవానంద్‌రెడ్డి, గోవిందురెడ్డి, యుగంధర్‌రెడ్డి, రాఘవేంద్రరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


జేఎన్‌టీయూఏలో యోగి వేమన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రిజిస్ట్రార్ ప్రొఫెసర్ శశిధర్


జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


వేమన సాహిత్యాన్ని తెలిపే పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

క్లుప్తంగా

జేవీవీ పోస్టర్ల విడుదల


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ సభ్యులు

అనంతపురం కల్చరల్: జేవీవీ నగర కమిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు పోస్టర్లను శుక్రవారం సాయంత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆత్మీయ అతిథిగా హాజరైన జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ గతేడాది నవంబరు 7 నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా శాస్త్రీయ దృక్పథం కలిగించే కళాజాతా నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగానే ఈనెల 21న గుంటూరులో 'ఆంధ్రప్రదేశ్‌లో శాస్త్రీయ అభివృద్ధి' అనే అంశంపై సదస్సు జరగనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జేవీవీ ప్రతినిధులు జిలాన్ బాషా, రామిరెడ్డి, వీరరాజు, లక్ష్మీనారాయణ, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కేశవరెడ్డికి నివాళి


ఆవేల కేశవరెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న తోపుదుర్తి చందు

ఆత్మకూరు: ఆత్మకూరుకు చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు ఆవుల కేశవరెడ్డి గురువారం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తోపుదుర్తి చంద్రశేఖర్‌రెడ్డి (చందు) శుక్రవారం కేశవరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. తోపుదుర్తి చందు మాట్లాడుతూ కేశవరెడ్డి వైఎస్సార్‌సీపీ కోసం పనిచేశారన్నారు. అనంతరం కేశవరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

శరవేగంగా పైప్‌లైన్ పనులు


కూడేరు మండలం చోళసముద్రం వద్ద పైప్‌లైన్ పనులను పరిశీలిస్తున్న నాయకులు

ఆత్మకూరు: శాశ్వత నీటి సమస్య పరిష్కారానికి చేపట్టిన పైప్‌లైన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. శుక్రవారం ఆత్మకూరు నుంచి కూడేరు మండలం చోళసముద్రం వరకు జరుగుతున్న పైప్‌లైన్ పనులను వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి దుబ్బ చంద్రశేఖర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రూ.95 కోట్లతో ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాల్లో శాశ్వత నీటి సమస్య పరిష్కరించేందుకు చేపట్టిన పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. పనులకు కావాల్సిన అన్ని యంత్రాలు, పైపులు, పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. 3,920 పైపులు పీఏబీఆర్ డ్యాం నుంచి ఆత్మకూరు వరకు వేస్తున్నట్లు తెలిపారు. ఈ నెలాఖరుకు పైప్‌లైన్ పనులు పూర్తవుతాయన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అతిక్‌రెడ్డి, నాగరాజు, లక్ష్మీనారాయణరెడ్డి పాల్గొన్నారు.

పొలం గట్టు కంచెకు నిప్పు


కాలిపోయిన పొలం గట్టు ముళ్ల కంచె

కనగానపల్లి: మండలంలోని వేపకుంటలో గురువారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పొలం గట్టుకు ఉన్న ముళ్ల కంచెకు నిప్పు పెట్టారు. దీంతో పొలం గట్టు పక్కన ఉన్న 20 చీనీ చెట్లు మంటలకు కాలిపోయాయి. బాధిత మహిళా రైతు లక్ష్మీదేవి తెలిపిన మేరకు.. గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో 5 ఎకరాల్లో 600 చీనీ చెట్లు సాగు చేస్తున్నారు. ఈ చెట్ల భద్రత కోసం చుట్టూ ముళ్ల కంచె వేయగా, రాత్రి వేళలో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దీంతో కంచె పూర్తిగా కాలిపోయింది. దీంతోపాటు సమీపంలో ఉన్న చీనీ చెట్లు, కొన్ని వ్యవసాయ పరికరాలు కాలిపోయాయి. దీనివల్ల రూ.50 వేల వరకు ఆస్తినష్టం సంభవించింది. బాధిత రైతు దీనిపై శుక్రవారం కనగానపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించినట్లు ఆలయ ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పూజల్లో ఉమ్మడి జిల్లా వాసులేగాక కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయంలో ప్రతి ఆది, మంగళ, శుక్రవారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

పండిత పరిషత్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అనంతపురం ఎడ్యుకేషన్: పండిత పరిషత్ అనంతపురం జిల్లా శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన 2024 క్యాలెండర్‌ను ప్రముఖ కవి, రచయిత ఏలూరు రంగన్న, సీపీఎం జిల్లా కార్యదర్శి రాంభూపాల్ శుక్రవారం ఆవిష్కరించారు. స్థానిక మొదటి రోడ్డులోని పొట్టి శ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏలూరు రంగన్న, రాంభూపాల్ మాట్లాడుతూ విద్యార్థులను చదువుతో పాటు విలువలు నేర్పించాల్సిన బాధ్యత గురువులపై ఉందన్నారు. పండిత పరిషత్ జిల్లా అధ్యక్షుడు హనుమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి తులసిరెడ్డి, రాష్ట్ర సహాధ్యక్షుడు ఎర్రిస్వామి, సీపీఎం నాయకులు రామిరెడ్డి, పండిత పరిషత్ నాయకులు సంజీవ కుమార్, సి. గోపాల్, పల్లె నాగరాజు, పల్లె జయరాం, రవికుమార్, వెంకటేశులు, రమణారెడ్డి, ధనుంజయ, అట్టే ఓబులేష్, కొండయ్య పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో నీటి సమస్య పరిష్కారం


మోటారు నుంచి వచ్చే నీటిని చూపుతున్న సిద్ధరాంపురం గ్రామస్తులు

ఆత్మకూరు: సిద్ధరాంపురం బీసీ కాలనీలో మోటారు మరమ్మతుకు గురవడంతో నీటి సమస్య తలెత్తింది. దీంతో ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతీసుకొని సమస్య పరిష్కరించారు. మరమ్మతుకు గురైన మోటారును తీసేసి కొత్త మోటారు తెప్పించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు జొన్నగిరి బాలపోతన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు సుబ్బర సంజన్న, పిల్లల శ్రీరాములు, పిల్లల సోమశేఖర్, సచివాలయ కన్వీనర్ అక్కులన్న, రామాంజనేయులు, నాగభూషణం పాల్గొన్నారు.

కందుకూరులో 'జగనన్న ఆరోగ్య సురక్ష'


కిట్లను అందిస్తున్న మండల స్పెషల్ ఆఫీసర్, ఎంపీడీఓ, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

రాప్తాడురూరల్: అనంతపురం రూరల్ మండలం కందుకూరు-1 సచివాలయంలో శుక్రవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం నిర్వహించారు. వైద్యులు డాక్టర్ మనోజ్ నందకుమార్, డాక్టర్ సంధ్య, డాక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. 467 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. మండల స్పెషల్ ఆఫీసర్ మల్లికార్జున, ఎంపీడీఓ పుల్లయ్య, కందుకూరు సర్పంచ్ ప్రశాంత్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి నరసింహారెడ్డి పాల్గొని పరిశీలించారు.

నిర్మాణ పనుల పరిశీలన : కందుకూరు-1 సచివాలయ పరిధిలోని బీసీ కాలనీలో 'గడప గడపకూ మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా రూ. 20 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ డ్రైన్ పనులను ఎంపీడీఓ పుల్లయ్య పరిశీలించారు. అనంతరం కుల గణన సర్వేను పరిశీలించారు. ఐదు రోజుల్లో ఈ ప్రక్రియను పూర్తి చేయాలని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లకు సూచించారు.

రీసోర్స్‌పర్సన్లకు శిక్షణ

గుత్తి: పట్టణంలోని మెప్మా భవనంలో శుక్రవారం ఏపీ మాస్ ఆధ్వర్యంలో రీసోర్స్‌పర్సన్స్‌కు నీరు, పారిశుధ్యం, పరిశుభ్రతపై శిక్షణ కార్యక్రమం జరిగింది. జిల్లా వాష్ కో-ఆర్డినేటర్ లక్ష్మీదేవి మాట్లాడుతూ పరిశుభ్రమైన నీరు, శుభ్రంగా ఉన్న మరుగుదొడ్లు వాడటం, హ్యాండ్ వాష్ అలవాటు చేసుకోవాలన్నారు.

నాయీబ్రాహ్మణులకు వైఎస్ జగన్ పెద్దపీట

అనంతపురం కార్పొరేషన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయీబ్రాహ్మణులకు పెద్దపీట వేశారని నాయీ బ్రాహ్మణ వెల్ఫేర్, డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ యల్లనూరు ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయీబ్రాహ్మణులకు ప్రభుత్వం చేసిన మేలు తెలియజేశారు. గత ప్రభుత్వాలు నాయీ బ్రాహ్మణులను ఓటు బ్యాంకుగానే వాడుకున్నాయన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాయీబ్రాహ్మణులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించారన్నారు. నాయీబ్రాహ్మణ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ డైరెక్టర్‌గా అవకాశం కల్పించేలా చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు శివకుమార్, వెంకటేశ్, సూర్య నారాయణ, కడవళ్ల నాగేష్, బ్రహ్మ, రుద్ర, సంపత్‌కుమార్, నాగరాజు, చంద్రశేఖర్, ఎర్రిస్వామి పాల్గొన్నారు.

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు


రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ విద్యార్థినులు

శింగనమల: ఆధునిక సాంకేతిక పద్ధతులతో పంటలు సాగు చేయడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చని బద్వేలు ఎస్‌బీవీఆర్ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు పేర్కొన్నారు. శుక్రవారం వారు ఈస్ట్ నరసాపురంలో రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. గ్రామీణ పటం, కాలక్రమం, బార్‌గ్రాఫ్, ప్రాబ్లమ్ ట్రీ అనాలిసిస్, సీజనల్ క్యాలెండర్, మ్యాట్రిక్స్ ర్యాంకింగ్ తదితర వాటిని వివరించారు. రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చందన, రైతులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా సోదనపల్లిలో శ్రీకృష్ణదేవరాయ వ్యవసాయ కళాశాల విద్యార్థినులు భాగస్వామ్య గ్రామీణ అంచనా, గ్రామ చిత్ర పటం, వెన్ చిత్రం, ధోరణి విశ్లేషణలపై రైతులకు వివరించారు. రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్త విద్య, రైతులు పాల్గొన్నారు.

ఫిట్నెస్ చాంపియన్ షిప్ విజేతకు ఘన సన్మానం

గుంతకల్లు: ఇటీవల బెంగళూరు ప్రో 2023 ఫిట్నెస్ చాంపియన్‌షిప్ సీనియర్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించిన పట్టణానికి చెందిన విశ్వతేజను మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. విశ్వతేజ తండ్రి ఆర్‌హెచ్‌ఎం కాశీనాథ్ స్నేహితులు (10 తరగతి బ్యాచ్ 1978) మున్సిపల్ మాజీ చైర్మన్ ఎస్.రామలింగప్ప, మాజీ కౌన్సిలర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో అతడిని శాలువాతో సత్కరించి నెట్టికంటి ఆంజనేయస్వామి చిత్రపటాన్ని బహూకరించారు. జాతీయస్థాయిలో పోటీల్లో రాణించాలని వారు విశ్వతేజకు సూచించారు.

కులగణన చరిత్రాత్మకం


మేయర్ వసీం నివాసంలో కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది

అనంతపురం కార్పొరేషన్: కులగణన చేపట్టాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయం చరిత్రాత్మకమని మేయర్ వసీం పేర్కొన్నారు. సమగ్ర కులగణన సర్వేలో భాగంగా నగరపాలక సంస్థ అధికారులు మేయర్ వసీం ఇంటి నుంచే కులగణనను ప్రారంభించారు. శుక్రవారం అదనపు కమిషనర్ రమణారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు మేయర్ నివాసానికి వెళ్లి కులగణన చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకుంటున్న నిర్ణయాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలు రూపొందించడానికి, సంక్షేమ పథకాలు అమలు చేయడానికి ఈ సర్వే వివరాలు ఉపయోగపడతాయన్నారు. కులగణన సర్వేను పకడ్బందీగా చేపట్టడానికి అన్ని చర్యలు తీసుకోవాలని సిబ్బందికి ఆదేశించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సైఫుల్లా బేగ్, పార్టీ మైనార్టీ విభాగం జిల్లా కార్యదర్శి షేక్ ఖాజా, నాయకులు షేక్ జావెద్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు


గాయపడిన రవి


ఆనంద్

బుక్కరాయసముద్రం: సిద్దరాంపురం రోడ్డు సమీపాన దేవరకొండ వద్ద శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రగాయాలపాలయ్యారు. పోలీసులు తెలిపిన వివరాలు సిద్దరాంపురం గ్రామానికి చెందిన రవి, ఆనంద్ ద్విచక్ర వాహనంపై బీకేఎస్‌లో సొంత పని ముగించుకుని స్వగ్రామానికి బయలు దేరారు. దేవరకొండ సమీపంలో జగనన్న లేఅవుట్ వద్ద సిద్దరాంపురం నుంచి బీకేఎస్ వైపు వస్తున్న మరో ద్విచక్ర వాహనం వారి వాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో రవి, ఆనంద్ తీవ్ర గాయాల పాలయ్యారు. స్థానికులు వారిని 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి వేంకటేశ్వరస్వామి వైభవ సప్తాహం

అనంతపురం కల్చరల్: నగరంలోని ఆర్ఎఫ్‌రోడ్డులోని లక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో సాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 20 నుంచి 26 వరకు వేంకటేశ్వరస్వామి వైభవ సప్తాహం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు విజయ్‌కుమార్ తెలిపారు. ముఖ్యంగా ఈనెల 22న అయోధ్య రామాలయం ప్రాణ ప్రతిష్ట జరుతున్నందున, నాటి విశిష్టతపై ప్రముఖ ఉపన్యాసకులు అన్నాజీ ప్రవచనం చేస్తారన్నారు. ప్రతిరోజు సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకు కార్యక్రమంకొనసాగుతుందన్నారు.

సామాజిక న్యాయ నినాదం.. జగనన్న విధానం


సామాజిక సమత సంకల్ప సభను ప్రజలు వీక్షించేందుకు ఏర్పాటు చేసిన భారీ స్క్రీన్‌ను ప్రారంభిస్తున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం, వాసంతి సాహిత్య


కార్యక్రమాన్ని తిలకిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

అనంతపురం కార్పొరేషన్: సామాజిక న్యాయ నినాదం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విధానమని మేయర్ వసీం పేర్కొన్నారు. విజయవాడలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతి వనం, 206 అడుగుల కాంస్య విగ్రహావిష్కరణ సందర్భంగా నిర్వహించనున్న సామాజిక సంకల్ప సభను నగర ప్రజలు వీక్షించేందుకు నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట భారీ స్క్రీన్ ఏర్పాటు చేశారు. మేయర్ వసీం, డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య, అధికారులు, ప్రజలు కార్యక్రమాన్ని వీక్షించారు. మేయర్ వసీం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి, ఆ మహనీయుడిపై ఉన్న గౌరవాన్ని సీఎం చాటుకున్నారన్నారు. రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ముస్లిం మైనార్టీలకు రాజ్యాంగబద్ధ, నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత కల్పిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. డిప్యూటీ మేయర్లు కోగటం విజయభాస్కర్ రెడ్డి, వాసంతి సాహిత్య మాట్లాడుతూ అన్ని వర్గాలభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఎస్ఈ రామమోహన్ రెడ్డి, ఈఈ సూర్యనారాయణ, డీఈలు సుభాష్, రవీంద్ర రెడ్డి, దాక్షాయణి, ఏఈలు బాబావలి, ఉమామహేశ్వరి, విజయ్‌బాబు, కార్పొరేటర్లు శేఖర్‌బాబు, సైఫుల్లాబేగ్, శ్రీనివాసులు, బాలాంజనేయులు, సంపంగి రామాంజనేయులు, రహంతుల్లా, లాలూ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ, నాయకులు రవీంద్రరెడ్డి, రామచంద్ర, తదితరులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం:

విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, కులగణన ప్రారంభించిన సందర్భంగా పార్టీ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ నాయకుల ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయ ఆవరణలో సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. నాయకులు మాట్లాడుతూ బడుగుల అభ్యున్నతికి సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీతోనే బడుగులకు సామాజిక న్యాయం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రీనివాసులు, నాయకులు నూర్ మహమ్మద్, హరి, రంగనాథ్, వన్నూర్ స్వామి, న్యాయవాది కిష్టప్ప, నాయకులు కృష్ణవేణి, ప్రసన్నలక్ష్మి, సుంకన్న, సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి నివాళి

రామగిరి: మండల కేంద్రంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి సర్పంచ్ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున శుక్రవారం నివాళులర్పించారు. విజయవాడలో అంబేడ్కర్ కాంస్య విగ్రహాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరిస్తున్న సందర్భంగా రామగిరిలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. మండలంలోని పేరూరు, పెద్దకొండాపురం, ఎంసీపల్లి, నసనకోట, మాదాపురం, కుంటిమద్ది, రామగిరి, పోలేపల్లి, గంతిమర్రి పంచాయతీల్లోని గ్రామాల ప్రజలు అంబేడ్కర్ విగ్రహ ఆవిష్కరణకు వెళ్లారు.

IndusInd Bank - CFD
COMMERCIAL VEHICLES FOR SALE
APE AUTO DX BS VI
2022 MODEL AP39 UE 7319
Cell : 70329 75897
11/168-2, 2nd Floor, Meda Ramaiah Setty Mansion, Backside Meda Petroal Bunk, Sapthagiri Circle, ANANTAPUR.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
అనంతపురము డివిజన్
9912220719, 9912220732, 9912220724,
9010223702, 9010567770, 9010588846, 9912220727